# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. క్షేత్రస్థాయిలో వరద బాధితుల అవసరాలు తీరుస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

**3. కృష్ణానదికి వరద ఉధృతి తగ్గుతోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

**4. రాష్ట్రంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అభివృద్ధి చేయనున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

===========================

క్షేత్రస్థాయిలో వరద బాధితుల అవసరాలు తీరుస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, వరదల వల్ల ప్రభావితమైన చివరి వ్యక్తికి వరకు సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలు తీర్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (35 సెకన్లు)

---------------------------

విజయవాడ నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. హెలికాప్టర్ల ద్వారా ఆహారాన్ని, త్రాగునీటిని అధికారులు బాధితులకు అందిస్తున్నారు. భారత వాయు సేనకు చెందిన హెలికాప్టర్ల ద్వారా విపత్తు నిర్వహణ బృందాలు ఆహారం, తాగునీరు, మందులను పంపిణీ చేస్తున్నారు. నగరంలోని సింగ్ నగర్, అంబాపురం, వాంబే కాలనీ, రాజరాజేశ్వరి పేట, మిల్క్ ప్రాజెక్టు తదితర ప్రాంతాల్లో ఆహారాన్ని అందిస్తున్నారు.

ఇక మరోవైపు విజయవాడలో వరద క్రమంగా తగ్గుతోంది. యనమలకుదురులోని పలు కాలనీలల్లోని ఇళ్లలో చేరిన నీరు తగ్గింది. సింగ్‌నగర్‌లో వరద ప్రభావం తగ్గేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని అలాగే విద్యుత్ పునరుద్ధరణకు కూడా మరింత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయవాడలోని సింగ్ నగర్ ముంపు ప్రాంతాలను కేంద్రమంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, సహాయక చర్యల్లో కేంద్ర విపత్తు బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. డ్రోన్ ల ద్వారా వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆహారం, తాగునీరు పంపిణీ చేస్తున్నామని కేంద్ర మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు, భవనాల సంరక్షణ విషయంలో అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వరద వల్ల ప్రభావితమైన కృష్ణా, గుంటూరు, పల్నాడు, పశ్చిమగోదావరి జిల్లాల అధికారులతో మంత్రి దృశ్య మాధ్యమం ద్వారా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వర్షాల కారణంగా 2,వేల కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయన్నారు. ఆ రహదారులకు వీలైనంత త్వరగా మరమ్మతులు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా వంతెనలు దెబ్బతిన్న ప్రదేశాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాల లను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా నిన్న ఫ్లోరిడా లోని ఆర్లాండో లో నిర్వహించిన గుంటూరు, రంగరాయ, సిద్ధార్థ వైద్య కళాశాలల పూర్వ విద్యార్థుల ద్వైవార్షిక సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 175 శాసనసభ నియోజకవర్గాల్లో పీపీపీ విధానంలో ఆస్పత్రులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. రాజధాని ప్రాంతంలో మెగా మెడికల్ సిటీని అభివృద్ధి చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

కృష్ణానదికి వరద ఉధృతి తగ్గుతోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ రోజు విజయవాడలో మంత్రి మాట్లాడుతూ, ప్రకాశం బ్యారేజీకి కొంతమేర వరద ఉధృతి తగ్గిందన్నారు. బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో వరద ప్రభావం మరింత తగ్గనుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (18 సెకన్లు)

---------------------------

భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో జరిగిన పంట నష్టం అంచనా వేసేందుకు చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో పంట నష్టం అంచనాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా

ఉండాలన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ఉధృతి కొనసాగుతున్న వ్యవసాయ క్షేత్రాలకు రైతులు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో, లంక గ్రామాల్లో ఉన్న వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

విజయవాడ నగరంలోని వరద ముంపు బాధితుల కోసం 75 వేల అత్యవసర మందుల కిట్లు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ తెలిపింది. ఈ కిట్లలో పారాసిటమాల్ మాత్రలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటివి ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఓ ప్రకటనలో తెలిపారు. 75 వేల కిట్లలో తొలివిడతగా 10 వేల కిట్లను హెలికాప్టర్ల ద్వారా బాధితులకు అందిస్తున్నామని వెల్లడించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లోనూ కిట్లు అందుబాటులో ఉంచినట్లు కృష్ణబాబు తెలిపారు.

---------------------------

కృష్ణానది లంక గ్రామాల ప్రజలందర్నీ సురక్షితంగా తరలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, లంక గ్రామాల ప్రజలందర్నీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చే వరకు అధికార యంత్రాంగం పని చేస్తుందని తెలిపారు. లంకల్లో పంటలు వేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. వరద తీవ్రత తగ్గిన తర్వాత పంట నష్టాన్ని పరిశీలించి పరిహారాన్ని అందిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్ కోరారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం-ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏక్ పేడ్ మా కే నామ్ తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం విజయభాస్కర్ మాట్లాడుతూ, అమ్మ పేరు మీద ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటి సంరక్షించాలని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు తల్లిపేరిట మొక్క నాటడం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా నిర్వహించాలని కోరారు.

---------------------------

మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోనూ పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. నిన్న పాడేరులో నిర్వహించిన జాతీయ పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ఈ నెల ఒకటవ తేదీ నుండి 30 వ తేదీ వరకు జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నమన్నారు. అంగనవాడీ కేంద్రాలు ద్వారా పౌష్టికాహార ప్రాధాన్యం, సమస్య నివారణకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, గర్భవతులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

---------------------------

ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలని అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ కోరారు. 39 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో బాగంగా అనంతపురం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ

ఆధ్వర్యంలో నిర్వహించిన  నేత్ర దాన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా  ఆయన మాట్లాడుతూ నేత్రదానం ద్వారా కంటి చూపులేని వారికి ఒకరి నుంచి సేకరించిన రెండు కళ్లలో ఒకటి అమర్చినా, అలా ఇద్దరికి చూపు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.  నేత్ర దానం చేయాలనుకునే వారు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారిని సంప్రదించాలని కోరారు.

---------------------------

======================